ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 18 నవంబరు 2024



ప్రతిభకు.. పట్టా



- మూడున్నరేళ్లకే ఇంజనీరింగ్ డిగ్రీ
- అసాధారణ విద్యార్థులకు ఆఫర్
- వీటీయూ వినూత్న ప్రయోగం
- ఈ ఏడాది నుంచే అమలు

వీటీయూ



బెంగళూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఇంజనీరింగ్ కోర్సు నాలుగేళ్లపాటు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రతిభావంత విద్యార్థులకు మూడున్నరేళ్లలోనే పూర్తి చేసుకునే మహత్తరమైన అవకాశాన్ని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీటీయూ) పరిచయం చేస్తోంది. బెళగావి కేంద్రంగా ఉండే యూనివర్సిటీ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలకు అనుబంధంగా ఉంది. ప్రైవేట్ యూనివర్సిటీలకు మినహా మిగిలిన ఇంజనీరింగ్ కళాశాలలకు వీటీయూ ప్రధానకేంద్రంగా ఉంది. వినూత్న ప్రక్రియ ద్వారా విద్యార్థులు ఆరు నెలలు ముందుగానే కోర్సు పూర్తి చేసే అవకాశం ఉంది. తదుపరి ఉన్నత విద్య లేదా ఉద్యోగంలో చేరేందుకు వెసలుబాటు కల్పించినట్లు అవుతోంది. ప్రతిభావంత విద్యార్థులకు ఈ ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. మూడున్నరేళ్లలోనే నాలుగేళ్ల కోర్సును పూర్తి చేసేందుకు వీలు కల్పిస్తున్నారు. కోర్సు పూర్తి కాగనే ఇంజనీరింగ్ పట్టా ప్రదానం చేయనున్నారు. వీటీయూ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 208 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. 3లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి కళాశాలను గడువుకు అనుగుణంగా అకడమిక్ సిలబస్‌ను పూర్తి చేయాలని వీటీయూ సూచించింది. ల్యాబ్ పరీక్షలు, ఇంటర్నల్స్ సెమిస్టర్ ముగిసిన వెంటనే మార్కుల జాబితాలను వీటీయూకు పంపాలని సూచిస్తోంది. విద్యార్థులు ఏడో సెమిస్టర్‌లోనే ఇంటర్న్‌షిప్, టెక్నికల్ సెమినార్‌లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎనిమిదో సెమిస్టర్‌లోని అకడమిక్‌ను ఏడో సెమిస్టర్‌లోనే పూర్తి చేస్తారు. ప్రతి కోర్సుకు 160 మార్కులు ఉంటాయి. ఇందులో సంపూర్ణ వివరాలను కళాశాల ప్రిన్సిపాళ్లకు సూచించారు. విద్యార్థులు అర్థం చేసుకునే బాధ్యతను ప్రిన్సిపాళ్లకే అప్పగించారు. ప్రాజెక్ట్-1, 2లను ఒక్కటిగానే పరిగణించాలని నిర్ధారించారు. 2022లో ఇంజనీరింగ్‌లో ప్రవేశించి ప్రస్తుతం నాల్గో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు అసాధారణమైన కొత్త విధానంతో డిగ్రీని పూర్తి చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రెండో, మూడో సెమిస్టర్ విద్యార్థులు క్యుములేటివ్ గ్రేడ్‌పాయింట్ యావరేజ్ (సిజిపిఎ) శాతం 9కంటే ఎక్కువ ఉండాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ స్థాయిలో మార్కులు సాధించకపోతే రిజిస్ట్రేషన్ చేసుకున్నా కూడా చివరిక్షణంలో రద్దు కానున్నాయి. అకడమిక్‌లో అసాధారణ ప్రతిభ కనబరచి అన్నింటా సీజీపీఏలో 9శాతం కంటే ఎక్కువ రాణిస్తేనే అర్హత పొందుతారు. అయితే ప్రతిభావంత విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహం అందిస్తే పోటీతత్వం పెరిగి మరింత చదువుతారని భావిస్తున్నారు.

ఆందోళన వద్దు.. అనర్హులవి మాత్రమే... రద్దు



- రేషన్ కార్డులపై సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీపీఎల్ కార్డుల రద్దుపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, కేవలం అనర్హులకు సంబంధించిన వాటిని మాత్రమే రద్దు చేస్తామని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. బాగల్కోటెలో ఆదివారం సీఎం మీడియాతో మాట్లాడుతూ అర్హులైన బీపీఎల్ కార్డుల లబ్ధిదారులకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. అనర్హులకార్డులు రద్దు చేయాలనేదే తమ ఆలోచన అన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు బీపీఎల్ కార్డులు పొంది ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు. ఎంతమంది అనర్హుల కార్డులైనా తొలగించవచ్చును గానీ అర్హులైనవారికి అన్యాయం జరగరాదన్నారు. ప్రభుత్వ, అనుబంధ సంస్థలు కార్పొరేషన్ ఉద్యోగులతోపాటు ఆదాయపన్ను, సర్వీస్ ట్యాక్స్, జీఎస్టీలు చెల్లించేవారిని అనర్హులుగా తొలగిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 హెక్టార్లలో మెట్ట, అందుకు సమానంగా సాగు భూమి ఉన్న కుటుంబాలు కూడా అనర్హులే అన్నారు. నగర ప్రదేశాల్లో వెయ్యి చదరపు అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణంలో సొంత ఇంటివారు అనర్హులన్నారు. జీవనం కోసం సొంతంగా కమర్షియల్ వెహికల్స్ ట్రాక్టర్, మ్యాక్సీ క్యాబ్, ట్యాక్సీలు కల్గినవారిని మినహాయించి ఇతర నాలుగు చక్రాల వాహనాలు కల్గినవారిని అనర్హులుగా భావిస్తామన్నారు. ఏడాదికి కుటుంబ ఆదాయం రూ.1.20 లక్షలకంటే ఎక్కువ ఉంటే అనర్హులవుతారన్నారు. మిగిలినవారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. గ్యారెంటీల అమలుకే రేషన్ కార్డులు రద్దు చేస్తున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలు అబద్ధమన్నారు. సామాన్యులకు అన్యాయం చేసే ఉద్దేశం ఎలాంటి కోనానా లేదన్నారు.



బళ్లారి జిల్లాసుపత్రి

ప్రసవం.. ప్రశ్నార్థకం..!

- బళ్లారిలో బాలింతల మృతితో కలకలం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులపై ఆరా
- చర్యలు తీసుకుంటున్నా దక్కని ఫలితం

బళ్లారి నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఇటీవల బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన బాలింతల మృతి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రసవ సమయంలో వైద్యం అందక మూడేళ్లలో 2,079 మంది బాలింతలు మృతి చెందారు. ప్రసవ సమయంలో 822 మంతి మరణించారని అధికారిక నివేదికలో తెలుస్తోంది. బళ్లారిలో ముగ్గురు మృతి ఆస్పత్రిలో ఉన్న గర్భిణులకూ దడ పుట్టిస్తోంది. మరో నలుగురు బాలింతల పరిస్థితి విషమంగా ఉండడంతో విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రసవ సమయంలో మృతుల సంఖ్య వెల్లడైంది. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ఆమలు చేస్తున్నప్పటికీ మరణాలు ఆగడం లేదు. గర్భధారణ సమయంలో రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి తగిన చికిత్స అందిస్తున్నా ప్రసవ సమయంలో మరణాలు తగ్గడం లేదు. మూడేళ్లలో రాష్ట్రంలో జరిగిన మరణాల సమగ్ర సంఖ్య యూనియన్ కర్ణాటకకు అందుబాటులోకి వచ్చింది. 2021-22 నుంచి సెప్టెంబరు 2024 చివరి వరకు 2,079 మంది బాలింతలు మరణించారు. 2021-22లో 782మంది, 2022-23లో 699మంది, 2023-24 లో 598మంది బాలింతలు మృతి చెందారు. ఆదునిక చికిత్సా విధానాలు, అవగాహన కార్యక్రమాల తర్వాత కూడా ఇంత మొత్తంలో బాలింతల మరణాలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

మరోసారి తెరపైకి అహింద

- హాసన్ వేదికగా భారీ సభకు సీఎం వ్యూహం
- 'ముడా' వ్యవహారాన్ని దారి మళ్లించేందుకే..
- ప్రతిపక్షాల విమర్శలు.. • తిప్పికొట్టిన సిద్ధూ

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎదురుదెబ్బలు తీవ్రమవుతున్న తరుణంలో సీఎం సిద్దరామయ్య వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే 'అహింద' పేరిట భారీ బహిరంగ సభలు నిర్వహించిన సిద్దరామయ్య తాజాగా ముఖ్యమంత్రి హోదాలో అమలు చేయదలిచినట్లు సమాచారం. అల్పసంఖ్యాత (మైనారిటీ), హిందుళిత (బీసీ), దళిత సామాజికవర్గాలను సమైక్యం చేసేలా 'అహింద' పేరిట సిద్దరామయ్య ఎన్నో పోరాటాలు చేశారు. డిసెంబరు 5న మాజీ ప్రధాని దేవేగౌడ సొంత జిల్లా హాసన్‌లోనే ప్రతిపక్షాలకు ధీటైన సమాధానం చెప్పాలని ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.

'ముడా'లో నిండా మునిగిన సీఎం

ముడా వివాదం సీఎం సిద్దరామయ్యను పూర్తిగా ముంచేసేలా ఉంది. ఇప్పటివరకు సాగింది ఒక ఎత్తైతే త్వరలోనే ఈడీ కూడా నోటీసులు జారీ చేస్తుందనే ప్రచారం జోరందుకుంది. లోకాయుక్త విచారణకు ఇప్పటికే సీఎం సిద్దరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జునస్వామి, భూయజమాని దేవరాజ్ హాజరయ్యారు. మరోవైపు ఈడీ అధికారులు జరిపే ప్రక్రియను వేగవంతం చేశారు. దీన్నిబట్టి అధికారులతో సమగ్ర సమాచారం రాబట్టి ఆ తర్వాత సీఎంతో సహా కుటుంబ సభ్యులకూ నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముడా మాజీ చైర్మన్ మర్రిగౌడను ఏకంగా ఒకరోజంతా ఈడీ అధికారులు విచారణ జరిపారు. సిద్దరామయ్య కుటుంబీకులు ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన తహసీల్దారును విచారించారు. ఈ వారంలోనే సీఎం సిద్దరామయ్యకు ఈడీ నుంచి నోటీసులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సూత్రప్రాయంగా సమాచారం. ఇటీవల మైసూరులో ఓ బహిరంగసభలో సీఎం పలు అంశాలను ప్రస్తావించారు. ముడా వివాదంలో తన భార్యను కేసులతో వేధిస్తున్నారని వాపోయారు. 50మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ సిద్ధమైందని ఒక్కొక్కరికి రూ.50కోట్లు ఇచ్చే ఆశ చూపారని ఆరోపించారు. తనను ఎవరైనా టచ్ చేస్తే కర్ణాటక ప్రజలు చూస్తూ ఊరుకోరని సవాల్ విసిరారు. సీఎం వ్యాఖ్యలపై రాజకీయ నిపుణులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈడీ కేసులు ముంచుకొస్తున్న తరుణంలోనే సీఎం ఇలా వ్యాఖ్యానించారని అంటున్నారు. కాగా ఏడాదిన్నర క్రితం శాసనసభ ఎన్నికలకు ముందు 40శాతం కమీషన్ తీసుకున్నారని బీజేపీపై విమర్శలతో పాటు పత్రికా ప్రకటనలు జారీ చేశారు. బీబీఎంపీలో 40శాతం కమీషన్ డిమాండ్ చేశారని బీబీఎంపీ కాంట్రాక్టర్ల సంఘం ఉపాధ్యక్షుడు అంబికాపతి ఆరోపించిన విషయమై లోకాయుక్త విచారణ జరిపిన విషయం తెలిసిందే. శనివారం విడుదల లోకాయుక్త విడుదల చేసిన నివేదికలో అంబికాపతి ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చింది. అంబికాపతి ఓ ప్లేగ్రౌండ్‌ను కాంట్రాక్టుకు తీసుకోలేదని అయినా అధికారులకు లంచం ఇచ్చానని ఆరోపణలు చేసిన విషయంలో ఎక్కడా సమగ్రత లేదని లోకాయుక్త ప్రస్తావించింది. 40శాతం కమీషన్ అనేది అబద్ధమని స్వయంగా లోకాయుక్త తేల్చిన మేరకు ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని బీజేపీ ప్రతిపక్షనేత ఆర్ అశోక్, పార్టీ అధ్యక్షుడు విజయేంద్రలు డిమాండ్ చేశారు.

విజయవంతం చేసేందుకు ప్రణాళిక..

'అహింద' సభ విజయవంతం చేసేందుకు మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, హాసన్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేఎన్ రాజణ్ణలకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. స్వయంగా సిద్దరామయ్య మైసూరు, మండ్య, కొడగు, హాసన్, చామరాజనగర జిల్లాల కాంగ్రెస్ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలకు అహింద సభ విజయవంతానికి సిద్ధం కావాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈనెల 20న సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లి అధిష్ఠానం పెద్దలను కలసి అహింద సభ జరుపుకొనేందుకు అనుమతులు కోరదలిచినట్లు సమాచారం. అధిష్ఠానం అనుమతి ఇస్తే శాసనసభ ఎన్నికలకు ముందు దావణగెరెలో 'సిద్దరామోత్సవ' పేరిట భారీ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. అందుకు ధీటుగానే హాసన్‌లో బలప్రదర్శనకోసం అహింద సభ నిర్వహించదలిచినట్లు తెలుస్తోంది. మరో నాలుగైదు రోజుల్లో హాసన్ అహిందసభకు సంబంధించి సమగ్రత రానున్నట్లు తెలుస్తోంది.



దావణగెరె సిద్దరామోత్సవ సభలో ప్రసంగిస్తున్న సీఎం (ఫైల్)

మంత్రి జమీర్‌కు లోకాయుక్త నోటీసులు

- ఆదాయానికి మించి ఆస్తుల వివాదం



బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల వివాదంలో రాష్ట్ర వసతి నిర్మాణ, వక్ఫ్ శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌కు లోకాయుక్త పోలీసులు శనివారం నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 3న స్వయంగా హాజరు కావాలని నోటీసులలో పేర్కొన్నారు. నోటీసులపై మంత్రి జమీర్ అహ్మద్ స్పందించారు. ఇదో సామాన్య ప్రక్రియ అని ఇందులో కొత్త అంశం లేదన్నారు. ఐ మానిటరీ అడ్వైజరీ (ఐఎంఏ) అక్రమ నగదు బదిలీకి సంబంధించి ఈడీ అధికారులు 2021లో జమీర్ అహ్మద్‌కు సంబంధించిన ఇల్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కల్గి ఉన్నారని ఏసీబీ అధికారులకు నివేదిక ఇచ్చారు. ఈడీ అధికారుల నివేదికకు అనుగుణంగా ఏసీబీ అధికారులు ప్రాథమిక విచారణ జరుపుతున్నారు. దాడులలో జమీర్ అహ్మద్‌ఖాన్‌కు సంబంధించిన ఆస్తులు ఆదాయానికి మించి 2031 శాతం అధికంగా ఉన్నాయని గుర్తించారు. ఏసీబీ దాఖలు చేసినకేసును రద్దు చేయాలని 2022లో జమీర్ అహ్మద్ దాఖలు చేసుకున్న రిట్ పిటీషన్‌ను హైకోర్టు ధర్మాసనం 2023 నవంబరులో రద్దు చేసింది. ఈ అర్జీ పిటీషన్ వేళ ఏసీబీ అధికారులు 2005 నుంచి చామరాజపేట ఎమ్మెల్యేగా, వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా మంత్రిగా వ్యవహరించిన జమీర్ అహ్మద్ రూ.87,44,057 ఆదాయం కలిగి ఉన్నారని, దాడులలో గుర్తించిన ఆస్తుల వివరాలను పరిశీలిస్తే 2031శాతం అధికంగా ఆస్తులు కలిగి ఉన్నారని సమగ్ర విచారణ అవసరమని హైకోర్టుకు వివరించారు. వివరాలను లోకాయుక్త అధికారులు ఆరా తీసేందుకు జమీర్ అహ్మద్‌కు నోటీసులు జారీ చేశారు.



బళ్ళారి సెంట్రల్ జైల్

ఒకేరోజు 116 మంది విడుదల

ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా జీవిత ఖైదు పడిన 116 మంది ఖైదీలు ఒకే రోజు విడుదలయ్యారు. బళ్ళారి సెంట్రల్ జైల్ వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనతో ఆయా కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివెరిసింది.

ధర పతనంతో వరి రైతుల్లో ఆందోళన



రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

వరి పంట చేతికొచ్చే సరికి ధరలు పడిపోవడంతో రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. బళ్లారి జిల్లాల్లో ఈ ఏడు వరి విస్తారంగా సాగు చేశారు. అయితే ధర లేకపోవడంతో రైతులకు ఆవేదనే మిగిలింది.

వివరాలు 8లో..



డెంకణీకోట అడవిలోకి ప్రవేశిస్తున్న గజరాజులు

బెంబేలెత్తిస్తున్న గజరాజులు

- పంటలు దెబ్బతింటున్నాయని అన్నదాత ఆవేదన

హోసూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా రైతులను గజరాజులు బెంబేలెత్తిస్తున్నాయి. పంట పొలాల్లోకి ప్రవేశించిన ఏనుగులు పంటలు పాడు చేస్తున్నాయని ఆవేదన చేస్తున్నారు. హోసూరు సమీపంలోని శానమావు అడవిలో ఏనుగుల మకాం వేశాయి. ఇటీవల పదికి పైగా ఏనుగులను డెంకణీకోట అడవుల్లోకి తరిమికొట్టారు. అయితే డెంకణీకోట అటవీప్రాంతం నుంచి హోసూరు పక్కనే ఉన్న ఊడేదుర్గం ప్రాంతానికి ఈనెల 12న 20కి పైగా ఏనుగులు వలస వచ్చాయి. ఈ ఏనుగుల గుంపు క్రమంగా శానమావు అటవీప్రాంతంలోకి చేరాయి. సమీప ప్రాంతాల్లో వరి, రాగి టమోటా, బీన్స్, క్యాబేజీ వంటి పంటలు సాగు చేస్తున్నారు. పొలాల్లోకి ఏనుగులు వస్తే పంటలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగులను తరిమికొట్టాలని సమీప గ్రామాల రైతులు కోరుతున్నారు. శనివారం రాత్రి డప్పులు కొట్టి, బాణాసంచా పేల్చి డెంకణీకోట అడవిలోకి తరిమికొట్టారు. దీంతో రైతులు కొంత ఉపశమనం పొందారు. మళ్లీ ఏనుగులు వస్తాయేమోననే ఆందోళన వారిలో నెలకొంది.



పిచ్చిమొక్కలతో నిండిన రైతు భవనం

భవనం..!



బళ్లారిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్షలు పోసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఉపయోగంలోకి తీసుకు రాకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పీడీ హళ్లి సమీపంలో హగరి ఏఆర్ఎస్ ఫారంలో రైతు భవనాన్ని ప్రారంభించి రెండేళ్లయినా అందులో ఎలాంటి కార్యకలాపాలు ప్రారంభించలేదు. దీంతో చుట్టూ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఈ ప్రాంతమంతా అడవిని తలపిస్తోంది. రైతులకు సేవలందించే భవనం నిరుపయోగంగా మారడంపై అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పుస్తకసంతలో సందర్శకులు

పుస్తక పఠనం.. కొత్త ఆలోచనలకు నాంది

- స్ట్రీట్‌బాక్స్ తరహాలో బుక్ బాక్స్
- పుస్తకసంతకు భారీ స్పందన



కృషి మేళాలో సందర్శకుల సందడి

కృషిమేళాకు పోటెత్తిన జనం

రాష్ట్రంలో రైతులకు మార్గదర్శకంగా నిలవడానికి నిర్వహించే కృషిమేళా విజయవంతంగా ముగిసింది. నగరవాసులు పల్లె వాతావరణాన్ని ఆస్వాదించారు. గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే)లో జరిగిన మేళాకు నాల్గో రోజు సందర్శకులు పోటెత్తారు. గురువారం ప్రారంభమైన కృషి మేళా ఆదివారంతో ముగిసింది.

వివరాలు 7లో..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.08	1,601.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,269	1,829
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,007	8,450
నీటి నిల్వ (టీఎంసీలు)	98.18	24.06



జెన్నీ మిల్క్ కార్యాలయం వద్ద సీఐడీ అధికారులు

'జెన్నీ' వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు ముమ్మరం

బళ్లారి సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గాడిద పాల వ్యాపారంల పేరుతో రైతులను మోసం చేసిన జెన్నీ కంపెనీపై సీఐడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. అధికారుల బృందం ఐదుగురు నిందితులతో కలిసి జెన్నీ మిల్క్ కంపెనీ కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో పంచనామా నిర్వహించింది. సీఐడీ కలబురగి డివిజన్ డీఎస్పీ అస్లాం పాషా నేతృత్వంలోని ఎనిమిది మంది అధికారుల బృందం విచారణలో పాల్గొంటోంది. పట్టణపోలీస్ స్టేషన్‌లో లభించిన 3600పేజీల పత్రాలను ఇప్పటికే తనిఖీ చేసిన సీఐడీ అధికారుల బృందం నిందితుల నుంచి కొన్ని ముఖ్యమైన సమాచారాన్ని బ్లాక్ చేసినట్లు అధికారులు తెలిపారు. సీఐడీ అధికారుల బృందం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు వెళ్లనుండగా, నిందితుడు హర్ష వర్ధన రాజును పంచానామా నిర్వహించే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించిన కొంత సమాచారాన్ని కూడా సవరించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి . గాడిద పాల వ్యాపారంలో ఇప్పటికే 319 మంది రూ.13.36 కోట్లు మోసపోయారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఈ కంపెనీ లావాదేవీలు జరిపిన 33 ప్రధాన బ్యాంకు ఖాతాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలపై కూడా సీఐడీ బృందం విచారణ చేపట్టింది.

బెయిల్ నిరాకరణ

జెన్నీ మిల్క్ కంపెనీ ప్రతినిధులు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో బెయిల్‌కు అప్పీల్ చేశారు. కేసు విచారణలో ఉన్నందున జిల్లా న్యాయాధికారి అబ్దుల్ రెహమాన్ నందగాడి పిటిషన్‌ను తిరస్కరించారు. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం బెయిల్ మంజూరుకు అంగీకరించనట్లు తెలుస్తోంది.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ



సిరుగుప్ప, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని దేశనూరు గ్రామంలో దళిత సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వీరేష సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా దేశనూరు గ్రామస్థులు, దళిత సంఘం నాయకులు నాగేశ్వరరావు, రాము, యర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపాదలపై స్వామివారి ఊరేగింపు

కంప్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హడగలి తాలుకా నాగత్తి బసాపురంలోని ఆలుస్వామిని శనివారం రాత్రి ముళ్లపొదలపై ఊరేగించారు. ఏటా ఆలుస్వామి మఠం పారంపర్యంగా తగ్గిన మఠ గిరిరాజ హాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యేటా హాలస్వామి ముళ్లపొదలపై ఊరేగింపు కార్యక్రమానికి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 49వ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ ఊరేగింపు చేపట్టామన్నారు. ప్రతి ఇంటా మహిళలకు ఒడినింపే కార్యక్రమం చేపడతారన్నారు.



ముళ్లపొదలపై ఊరేగుతున్న హాలస్వామి

ధర పతనంతో వరి రైతుల్లో ఆందోళన

బళ్లారి సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం ధర పడిపోవడంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు. జిల్లాలోని మోకా, సిరుగుప్ప తదితర ప్రాంతాల్లో వేదవతి హగరి, తుంగభద్ర నది, గొట్టపు బావి నీటి సాయంతో వరిసాగు చేసిన వరి పంటను రైతులు కోసి కల్లాలకు తరలిస్తున్నారు. అసలే ధర లేక విలవిల లాడుతున్న రైతులకు ఇటీవల కురిసిన వర్షాలు మరింత చేటు చేశాయి. జిల్లా రైతులు సాధారణంగా సోనా మసూరి, సోనా, నెల్లూరు సోనా, గంగా కావేరి, ఆర్ఎన్ఆర్, ఎంఎస్-2, ఆర్ఎన్ఆర్ 15048 రకాల వరిని పండిస్తారు. పంట చేతికొచ్చే సరికి ధరలు పడిపోయాయని అన్నదాత వాపోతున్నారు. ప్రస్తుతం ఆర్ఎన్ఆర్ 15048 క్వింటాల్‌కు రూ. 2100 నుంచి రూ. 2200, నెల్లూరు సోనా, గంగాకావేరి, సోనా క్వింటాల్‌కు రూ.1800 నుంచి రూ. 1850 పలుకుతుంది. వరి రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు మరింత తక్కువ ధరకు అడుగుతున్నారు. కమీషన్ల పేరుతో రైతుల నుంచి దోచుకుంటున్నారు. గిట్టుబాటు ధరలేక కనీసం పెట్టుబడులకు కూడా రావడం లేదని అన్నదాత వాపోతున్నారు. ప్రభుత్వం కనీసం మద్దతు ధర ప్రకటించాలని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులను ప్రభుత్వం



వర్షానికి తడిసిన వరి ధాన్యం

ఆదుకోవాలని వారు కోరుతున్నారు. వరి రైతుకు పరిహారం చెల్లించాలని సిరుగుప్ప రైతు సంఘం అధ్యక్షుడు వి.మారుతి అన్నారు.

16వ శతాబ్దం నాటి తామ్ర శాసనాలు లభ్యం



కన్నడ, తెలుగు భాషల్లో ఉన్న తామ్ర పత్రాలు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలం నాటి తామ్ర పత్రాలు లభ్యమయ్యాయి. కొప్పళ జిల్లా గంగావతి తాలూకా, బుక్కసాగర మఠంలో రాగి శాసనాలు లభ్యమయ్యాయి. ఈ తామ్ర పత్రాల గ్రంథాలు 16వ శతాబ్దం కాలం నాటివిగా చరిత్ర పరిశోధకులు డాక్టర్ శరణబసప్ప కోల్కర్ పేర్కొన్నారు. ప్రజల ఇచ్చిన సమాచారం మేరకు రెండు రాగి శాసనాలు ఉన్నట్లు గుర్తించారు. మఠంలో మొత్తంమూడు శాసనాలు ఉన్నాయని, వాటిలో ఒకటి ఇప్పటికే ప్రచురించబడిందని, మిగిలిన రెండు ప్రచరించలేదనారు. మఠంలోని ప్రస్తుతం స్వామీజీ కరిసిద్దేశ్ర్ విశ్వారాధ్య, విశ్వనాథ స్వామిరాగి శాసననాలను అనుమతి ఇవ్వడంతో 16వ శతాబ్దం నాటి తామ్రపత్రాలు వెలుగు చూశాయి. మొదటి శాసనంలో 1612నాటిదని, చంద్రగిరిని కేంద్రంగా చేసుకుని పాలించిన విజయనగర అరవీడు కుటుంబానికి చెందిన వెంకటపతి దేవరాయలు గంగావతి సమీంపలోని కల్గుడి అనే గ్రామాన్ని బుక్కసాగరంలోని కరిసిద్దేశ్వర మఠానికి జంగామార్చన కోసం దానం చేసినట్లు శాసనసంలో పేర్కొంది. అదే కారణంగా గంగావతి తాలూకాలోని కల్గుడిని జంగమర కల్గుడి అని పిలుస్తారు. రెండవ శాసనం 21పంక్తులలో, తెలుగు భాష కన్నడ లిపిలో ఉంది. విజయనగర చక్రవర్తి బుక్కరాయల కాలంలో కుంద్రుపి సంస్థానానికి చెందిన వీరమల్లనగౌడ రెడ్డి చేసిన విరాళం గురించి సమాచారం ఇందులో ఉందని పరిశోధకులు తెలిపారు. మూడవ శాసనం 16వ శతాబ్దానికి చెందినదని, మూడు పలకలపై 47 పంక్తులలో వ్రాయబడిందన్నారు. ఇది కన్నడ భాషలో ఉంది. కేలాడి పాలకుడు వెంకటప్ప నాయకుని సూచన మేరకు మహానాడుకు, నానా ప్రాంతానికి విరాళాలు ఇవ్వడం ప్రస్తావన ఉన్నట్లు తెలిపారు. 25మఠాల్లో వ్యాపారులు నిర్వహించే మహేశ్వరుని పూజకు మూడు వేసాల కాయలు, ఒక ఎద్దు, మిరియాలు, వరి, ఉప్పు పన్నును విరాళంగా ఇవ్వడం గురించి తామ్ర పత్రంలో ప్రస్తావించారు ఈ శాసనాలు చారిత్రత్మాకంగా ముఖ్యమైనవి, బుక్కసాగర్ మఠం యొక్క గురువు వారతస్వాన్ని, సమకాలీన పాలకులు, వ్యాపారులపై ఆయన ప్రభాన్ని అర్థః చేసుకోవడానికి సహాయ పడుతాయని, వీటిపై మరింత అధ్యయనాలు నిర్వహిస్తామని చారిత్రక పరిశోధకులు డాక్టర్ కోల్కర్ తెలిపారు.

పీడీఓ పరీక్ష నిర్వహణలో గందరగోళం

● రాస్తారోకోకు దిగిన అభ్యర్థులు



రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

రాయచూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో పీడీఓ పోస్టుల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష గందరగోళంగా మారింది. జిల్లాలోని సింధనూరు నగరంలో ఒక పరీక్ష కేంద్రంలో ప్రశ్నపత్రం బదిలీ కావడంతో అభ్యర్థుల్లో అనుమానం తలెత్తింది. ఒక బ్లాక్‌లో అభ్యర్థులకు పంపిణీ చేసిన ప్రశ్న పత్రాలు తక్కువగా ఉండడంతో అనంతరం దాన్ని గమనించిన సూపర్‌వైజర్ మరో బ్లాక్‌కు వెళ్లాల్సిన ప్రశ్న పత్రం బండిల్ మారినట్లు గుర్తించారు. దీంతో అభ్యర్థులు ప్రశ్నపత్రం లీకేజీ చేశారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పరీక్షను బహిష్కరించి రోడ్డుపైకొచ్చారు. ఒకటి రెండు బ్లాక్‌లు మినహా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు ఒక్కసారిగా పరీక్షను బహిష్కరించి బయటికి వచ్చి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో సింధనూరు-కుష్టగి వెళ్లే మార్గంలో మూడు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ తళవార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరరెడ్డి, సబ్ ఇన్స్‌పెక్టర్‌లు అక్కడికి చేరుకుని విద్యార్థులకు పరీక్షలను తిరిగి నిర్వహించేలా నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. అనంతరం అక్కడికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ, మాజీ ఎంపీ కే విరుపాక్షప్ప, మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ సర్వీస్ కమిషన్ కార్యదర్శితో మాట్లాడి అభ్యర్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరారు.

ఆకట్టుకున్న భారతీయ-విదేశీ కార్ల సంగమం

● ముగిసిన వింటేజీ కార్ల ప్రదర్శన

బళ్లారి గాంధీనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వింటేజీ కార్ల ప్రదర్శన విజయవంతంగా ముగిసింది. "ఎక్స్‌ప్లోర్ కర్నాటక హిస్టారిక్ డ్రైవ్ 2024" పేరుతో వింటేజ్ కార్ టూర్‌లో పాల్గొన్న భారతీయులకు చెందిన 20 వింటేజ్, విదేశీయులకు చెందిన వివిధ కంపెనీల 20 కార్లు హంపి సమీపంలోని కమలాపూర్ ఎవాల్వ్ బ్యాక్ స్టార్‌లో పర్యాటకులను అబ్బురపరిచాయి. అనంతరం ఆదివారం చిక్కమగళూరుకు బయల్దేరి వెళ్లాయి. హంపి పురవీధుల్లో కార్ల ప్రయాణాన్ని దేశ, విదేశీ పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఉదయం 8గంటలకు ఈవోల్‌లో ఉమ్మడి కారు యాత్రకు స్థానిక ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప గ్రీన్ సిగ్నల్ చ్చి ప్రారంభించారు. ఫెడరేషన్ ఆఫ్ హిస్టారిక్ వెహికల్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌హెచ్‌వీఐ) అధ్యక్షుడు డాక్టర్ రవిప్రకాష్, హంపి కిష్కింద, తుంగభద్ర డ్యామ్ దర్శనం జీవితంలో మరువలేనిదని, విదేశీయులు అధికంగా వచ్చే హంపిలో ఇలాంటి వారసత్వ విశేషాలు తరచుగా జరగాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, హంపి అందాలను తిలకించేందుకు వచ్చేవిదేశీయులను మరింతగా ఆకర్షించేందుకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వారసత్వ సంపదను యథాతదంగా ఉంచుతూ టూరిజయం అభివృద్ధికి చర్యలు తీసుకోవచ్చన్నారు. తాతల కాలం నాటి కార్లను చూసి పర్యాటకులు అబ్బురపోయారు.

ఆకర్షణీయమైన కార్ రైడ్‌లు

ఎవాల్వ్‌బ్యాక్ రిసార్ట్ అనేది హొసపేట-హంపి ప్రాంతాల్లో ఆకట్టుకునే భవనాలు, నీటి కొలనులతో ఉన్న ఏకైక ఫైవ్‌స్టార్ హోటల్. ఇంత ఆకర్షిణీయమైన వాతావరంలో విదేశీ కార్లు ఒకవైపు వరుసలో ఉండగా, మరోవైపు భారతీయ పాతకాలపు కార్లు నిలిచాయి. ఈ కార్లకు హంపి-హొసపేట నుంచి ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ పలుకుతూ వీడ్కోలు పలికారు. ఇతర విదేశీ కార్లు హొసపేట నుంచి బయలు దేరే సమ



ప్రమాదానికి ముందు రెసార్ట్ ముందు పర్యటనకు సిద్ధంగా ఉన్న వింటేజ్ కారు



చిక్కమగళూరకు బయలు దేరిన వింటేజ్ కార్లు

యంలో ప్రమాదవశాత్తు వింటేజ్ కారుకు నిప్పు అంటుకున్న విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ప్రదర్శనలో అపశ్రుతి

సజావుగా సాగుతున్న కార్ల ప్రయాణంలో అపశ్రుతి చోటు చేసుకుంది. హంపి శివారు ప్రాంతంలో రాయరకెర సమీపంలో ఉదయం 9 గంటలకు బెల్జియన్ పాల్ డెల్యూషన్‌కు చెందిన 1985 మోడల్ పోర్షెకారులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. మిగిలిన 19 కార్లు చిక్కమగళూరువైపు సాగిపోయాయి. హంపి, అంజనాద్రి, తుంగభద్ర ఆనకట్ట ప్రాంతాలు చుట్టిన భారత దేశానికి చెందిన 20 కార్లలో ఈ కారు కూడా ఒకటి. చాలా కార్లు ముందుకు దూసుకెళ్ళాయి. సాంకేతిక లోపంతో వెనుకబడిన కారు రాయరకెర సమీపానికి వచ్చిన సమయంలో ఉన్న ఫళంగా మంటలు



ప్రమాదంలో కాలిపోయిన కారు

చెలరేగాయి. కారులో ఉన్న వారు కారును వెంటనే ఆపి కిందకు దిగడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలోపే కారు పూర్తిగా కాలిపోయినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ హిస్టారిక్ వెహికల్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌హెచ్‌వీ) బెల్జియం ఆధారిత సంస్థ డెస్టినేషన్ ర్యాలీతో కలిసి ఈ పాతకాలపు కార్ల ప్రదర్శన నిర్వహించింది.

జైలు నుంచి 116 మంది విడుదల

బళ్లారి గాంధీనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బళ్ళారి సెంట్రల్ జైల్ నుంచి మరకుంబి కేసుకు సంబంధించి 98, ఇతర కేసుల్లో నిందితులు మొత్తం కలిసి 116మంది బెయిల్‌పై శనివారం విడుదలయ్యారు. బళ్లారి సెంట్రల్ జైల్ చరిత్రలో ఇంతమంది నిందితులు ఒకే రోజు విడుదల కావడం విశేషమని జైలు అధికారులు తెలిపారు. మరకుంబి హింసాచార కేసుకు సంబంధించి మొత్తం 98 మంది, రాయచూరులో జరిగిన ఓ హ్యాతకేసుకు సంబంధించి యావజ్జీవ శిక్ష పడిన 18మంది విడుదలైనట్లు జైలు సూపరింన్‌డెంట్ లత తెలిపారు. మరకుంబి కేసులో వాస్తవంగా 99మందికి విడుదల కావాల్సి ఉండగా, కేసులో శిక్ష ఖరారైన రోజునే రమణ అనే వ్యక్తి పేరు, జైలులో ఉన్న మరో నిందితుడు పేరు ఒకటే కావడంచేత విడుదలలో గందరగోళం నెలకొనడంతో ఆయన విడుదల వాయిదా వేసినట్లు తెలిపారు. అందుకోసం నిందితుల విడుదల ప్రక్రియలో ఆలస్యమైందని తెలిపారు. రామణ్ణ పేరుతో ప్రత్యేకంగా విడుదల ఆదేశాలు వచ్చిన తరువాత విడుదల చేయనున్నట్లు జైలు అధికారి తెలిపారు. ప్రస్తుతం బళ్ళారి జిల్లా కారాగారంలో 200మంది శిక్ష పొందుతున్న ఖైదీలు ఉండగా, 186మంది విచారణ ఖైదీలు ఉన్నట్లు తెలిపారు. విడుదల అయిన ఖైదీలను చూసి ఆయా కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతు పోరాటానికి స్ఫూర్తి లాల్



లాలా లజపతిరాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐకేకేఎంఎస్ సభ్యులు

బళ్లారి సిటీ,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతుల పోరాటానికి లాలా లజపతి రాయ్ స్ఫూర్తి ఎంతగానో ఉందని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం తాలూకాలోని కొర్లగుంది గ్రామంలో అఖిల భారత రైతు కృషి కార్మిక సంఘం (ఏఐకేకేఎంఎస్) రైతు సంఘం తరపున స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి గుర్లి రాజా మాట్లాడుతూ బ్రిటీషు వారిపై రాజీలేని పోరాటం చేసిన వారిలో లాలా లజపతిరాయ్ కీలకుడన్నారు. 1907లో బ్రిటీషువారు ప్రవేశపెట్టిన వివిధ వ్యవసాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన బారీ పోరాటంలో ఆయన పాల్గొన్నారన్నారు. రైతు పిల్లలకు ఆస్తి హక్కు కోసం ఆయన పోరాడాడన్నారు. ఈ పోరాటంలో ఆయన వీరమరణం పొందారన్నారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోవింద్, ఉపాధ్యక్షుడు బసన్న, కురుగోడు తాలూకా అధ్యక్షుడు లింగప్ప, జిల్లా కమిటీ సభ్యుడు మల్లప్ప, రైతులు శివలింగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సభ్యులకు సన్మానం



ప్రభుత్వ ఉద్యోగ సంఘం సభ్యులను సన్మానిస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కురుగోడు పట్టణంలో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులను ఆదివారం ఘనంగా సన్మానించారు. అధ్యక్షులుగా ఎన్నికైన గుండప్ప నాగరాజును, రాష్ట్ర సమితి సభ్యులుగా మంజునాథను, కోశాధికారిగా నాగరాజు మసూతి ఎన్నిక కావడంతో తాలుకాలోని రైతు సంఘం నాయకులు వారిని అభినందించారు. రైతు సంఘం నాయకులు సింధిగేరి గోవిందప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు జరుగుతున్న అన్యాయాలపై కొత్తగా ఎన్నికైన వారుప్రశ్నించాలన్నారు. ప్రతి ఉద్యోగి తమను నమ్మి మాకు ఓట్లు వేశారని వారి నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. గుండప్ప నాగరాజు మాట్లాడుతూ తమపై నమ్మకం వుంచి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ సమస్య వచ్చినా వాటిని ఎదుర్కొని నిలబడతామన్నారు. రైతు నాయకులు నాగప్ప, కలకంబ్ల మల్లికార్జున, సోమప్ప, ఉలిగప్ప, వడ్డట్టి హనుమంతు, దొడ్డ బసవ, పంపా, హనుమంతప్ప పాల్గొన్నారు.

'రాయలసీమ పొలికేక'కు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

కంప్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తిరుపతిలో గల ఆర్‌సీఆర్ హైస్కూలు గ్రౌండ్ ఆవరణలో డిసెంబరు 27న జరిగే రాయలసీమ పొలికేక సమావేశానికి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హొస్పేటలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తరతరాలుగా రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని చాటిచెప్పేందుకు, ప్రత్యేక రాయలసీమ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. రాయలు ఏలిన రాయలసీమ రతనాల సీమ అని నేటి రాయలసీమ రాళ్ల సీమగా మారుతుంటే త్యాగాలు మనవి, భోగాలు సర్కారు వారివిగా చెలామణి అవుతుంటే ఇంకా కళ్లు తెరవకుంటే సీమ బతుకు అధోగతే అన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌వలీ దర్గాస్వామి, క్రిష్ణ, యువజన నాయకులు రవికుమార్, జగదీష్, రాయలసీమ పొలికేక సమితి సభ్యులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

అదృశ్యమైన బాలుడు.. బావిలో శవమయ్యాడు..



సతీష్ (ఫైల్)

హొసూరు(క్రైం), నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా నాలుగేళ్ల బాలుడు ఆటలాడుకుంటూ కనిపించకపోగా మరుసటిరోజు బావిలో శవమై తేలాడు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హొసూరు నగరం బాగలూరు సమీపంలోని సూడాపురం గ్రామానికి చెందిన రైతు ఆకాష్ పెద్ద కుమారుడు సతీష్ (4) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో కొద్ది సేపటికి కనబడలేదు. తల్లిదండ్రులు స్థానికులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున అదే ప్రాంతంలోని వ్యవసాయ బావిలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. బాగలూరు పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం హొసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వీధికుక్కలతో రోడ్డు ప్రమాదాలు

హొసూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హొసూరు కార్పొరేషన్‌లో వీధికుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో వీధికుక్కలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో 20,800పైగా వీధికుక్కలు ఉన్నాయి. ఏ వీధి చూసినా వందల్లో సంచరిస్తుంటాయి. ప్రత్యేకించి రాత్రివేళల్లో వాటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధికుక్కల బారి నుంచి రక్షించాలని కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో కుక్కలను గుర్తించేందుకు రేడియం వెలుగునిచ్చేలాంటి ల్యూమినస్ బ్యాండ్‌లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. హొసూరు పారిశ్రామిక నగరం గుండుసూది నుంచి చేతి గడియారాల వరకు వివిధ రకాలు, ద్విచక్ర వాహనాలు, భారీవాహనాలు, మందులు, ఇతరత్రా తయారీ అవుతాయి. ఇక్కడి పరిశ్రమలలో లక్షన్నర మంది కార్మికులు వివిధ షిష్టులలో పని చేస్తున్నారు. రాత్రి షిష్టులు ముగించుకుని వచ్చే వేళ వీధికుక్కల బెడదతో సమస్యగా మారిందని వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు సరిగ్గా లేకపోవడం కూడా ఒక కారణమని తెలుస్తోంది. హొసూరు కార్పొరేషన్‌లో 45 వార్డులు ఉండగా, ఐదు లక్షలకు పైగా ప్రజలు ఉన్నారు. వీధికుక్కలను గుర్తించేలా తగిన బెల్ట్ వేయాలని కోరుతున్నారు. దీనిపై లువురు కౌన్సిలర్లు ఇప్పటికే నగరపాలక సంస్థ సమావేశంలో వీధికుక్కల బెడదను ప్రస్తావించారు. ఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మనోహరన్ మాట్లాడుతూ వీధికుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీధికుక్కలకు లైట్ వెలిగే బెల్ట్‌లు వేయాల్సిన అవసరం ఉందన్నారు.



నగరంలో సంచరిస్తున్న వీధికుక్కలు

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే

కంప్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో చేపట్టే ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం హొస్పేట అశ్విని నేత్రాలయం కూడ్లిగిలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సొంత ఖర్చులతో 70 మందికి పైగా నేత్ర చికిత్సలు చేయించారు. నియోజకవర్గంలో పేద ప్రజలను గుర్తించి ఈ శిబిరాలను నిర్వహించామన్నారు. ఎంతో మంది పేద ప్రజలు కంటిచూపులేక ఇళ్లకే పరిమితమయ్యారన్నారు. అలా కాకుండా మానవ జన్మలో



కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు

కాస్తయినా సుఖశాంతులతో జీవనం గడిపేందుకు ప్రజలు తమకిచ్చిన నమ్మకంతో సేవలు చేస్తున్నట్లు తెలిపారు.

వక్ఫ్ ఆస్తుల వివాదాన్ని తక్షణం పరిష్కరించాలి

● కేంద్ర మాజీ మంత్రి సీఎం ఇబ్రహీం



రాయచూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులకు సంబంధించి కొనసాగుతున్న వివాదాన్ని ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కేంద్ర మాజీ మంత్రి సీఎం ఇబ్రహీం డిమాండ్ చేశారు. భూములకు సంబంధించిన అన్ని ధ్రువపత్రుుఉ జిల్లాధికారి, తహసీల్దార్ స్థాయి అధికారులు కూలంకషంగా పరిశీలించి వాటిపై నిజానిజాలను ప్రజలముందుంచాలన్నారు. వక్ఫ్ బోర్డు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జిల్లాకు వచ్చిన కేంద్ర మాజీ మంత్రి ఇబ్రహీం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి రైతులకు గతంలోనే బీజేపీ హయాంలో యడియూరప్ప, ఎస్ ఆర్ బొమ్మెయి ముఖ్యమంత్రులుగా ఉన్న కాలంలోనే నోటీసులు అందాయని ప్రస్తుత మంత్రి అనుభవ రాహిత్యం వల్ల రైతులందరికీ నోటీసులు జారీ కావడం వివాదంగా మారిందన్నారు. ఈ విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకూడదన్నదే తన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప లు ఆర్థిక నేరాలకు పాల్పడిందని వీటిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

తిరుమలై కృష్ణమాచార్య (జయంతి)



ఆధునిక యోగా పితామహగా పేరొందిన తిరుమలై కృష్ణమాచార్య 1888 నవంబరు 18న చిత్రదుర్గ జిల్లా ముచుకుందపుర ప్రాంతంలో జన్మించారు. యోగాలోనే కాకుండా ఆయుర్వేద వైద్యంలోనూ, విద్వాంసుడిగానూ పేరొందారు. ప్రాణాయామం, ఆసనాలతో కూడిన 'హఠ యోగ'ను పునరుద్ధరించడంలో ఎంతో కృషి చేశారు. యోగాకు సంబంధించి పలు రచనలు చేశారు. యోగ మకరానంద, యోగాసనగళు, యోగ రహస్య తదితర రచనలు ప్రముఖమైనవి. మైసూరు మహారాజు నాల్గవ ఒడయార్ సహకారంతో దేశమంతా పర్యటించి యోగాను విస్తృతం చేశారు. ఆయన శిష్యులైన టీకేవీ దేశికాచార్, బీకేఎస్ అయ్యంగార్‌లు కూడా ఎంతో పేరొందారు. 1989 ఫిబ్రవరి 28న పరమపదించారు.

అవంత్స సోమసుందర్ (జయంతి)



ప్రముఖ అభ్యుదయవాది అవంత్స సోమసుందర్ తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సమీపంలోని శంఖవరంలో 1924 నవంబరు 18న జన్మించారు. తెలుగు కవి, విమర్శకుడు, రచయిత. 'వజ్రాయుధం' రచన ఎంతో పేరొందింది. ఆయన తొలి కవిత 'ఇంక్విలాబ్ జిందాబాద్' కూడా ఎంతో గుర్తింపు పొందింది. కథకుడిగా, నవలా రచయితగా నాటక కర్తగా అనువాదకుడిగా భిన్నరూపాలతో ఏడు దశాబ్దాలకుపైగా సాహితీసేవలు అందించి పలు పురస్కారాలు పొందారు. సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి, ఎన్టీఆర్ స్మారక జాతీయ పురస్కారం, కళారత్న పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక ట్రస్టు ద్వారా ఏటా కవులను ప్రోత్సహించేవారు. 92వ యేట జన్మదినం సందర్భంగా పిఠాపురంలో ఘనంగా సత్కరించారు. 2016 ఆగస్టు 12న కన్నుమూశారు.

నయనతార (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటి నయనతార 1984 నవంబరు 18న బెంగళూరులో మళయాళీ దంపతులకు జన్మించారు. అసలు పేరు డయానా మారియమ్ కురియన్. తమిళ, తెలుగు, మళయాళ భాషల సినిమాలలో 75 సినిమాలకు పైగా నటించారు. దాదాపు ప్రముఖ హీరోలందరితోనూ నటించగా బాక్సాఫీస్ వద్ద సినిమాలు విజయవంతం అయ్యాయి. 2018లో ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 సెలబ్రిటీ జాబితాలో దక్షిణాది తొలి మహిళగా స్థానం దక్కించుకున్నారు. 2011లో శ్రీరామ రాజ్యంలో 'సీత' పాత్రకు ఉగాది పురస్కారం అందుకున్నారు. 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, నంది అవార్డు, ఐఐఎఫ్ఎ, కలైమామణి ఇతర పురస్కారాలు పొందారు.

ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

శిడ్లఘట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని జయంతి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో కలసి బాలల దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించారు. టీచర్ మంగళా నేతృత్వంలో విద్యార్థులు కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను పాఠాలు బోధించే విద్యార్థులే తన పిల్లలని, వారి ముఖంలో సంతోషంతో ఎంతో తృప్తి కలిగిందన్నారు. తాను ఎంతో పేదరికం చవిచూశానని, తండ్రి ఎంతో కష్టపడి చదివించాడని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు టీచర్‌గా తనవంతుగా పిల్లలకు చక్కటి బోధిస్తున్నా ననే తృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రామాంజినమ్మ, స్కూల్ అసిస్టెంట్ శెహనాజ్‌బేగ్, చైత్ర, మనోహర్, భాగ్యలక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కొంగనహళ్లిలో చిరుత ప్రత్యక్షం

చింతామణి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార హోబళి కొంగనహళ్ళి గ్రామ శివారులోని కొండపై చిరుత సంచారంతో గ్రామస్థులలో ఆందోళన నెలకొంది. శనివారం సాయంత్రం గ్రామ శివారులో వాలీబాల్ ఆడుతున్న యువకుల బృందం కొండపై చిరుత సంచారాన్ని గుర్తించారు. ఈ మేరకు మొబైల్‌లో ఫోటోలు తీశారు. రెండు రోజులుగా కొండపై కోతుల అరుపులు ఎక్కువగా ఉన్నాయని చిరుత సంచారమే కారణమై ఉండవచ్చునని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. యువకులు గ్రామపంచాయతీ సభ్యుడు మునిస్వామిరెడ్డి దృష్టికి తేవడంతో ఒక ఫోటోగ్రాఫర్ ద్వారా డ్రోన్ కెమెరాతో చిరుత సంచారాన్ని నిర్ధారించారు. సదరు ఫోటోలను అటవీశాఖ అధికారులకు పంపినట్టు మునిస్వామిరెడ్డి తెలిపారు. ప్రాంతీయ అటవీ అధికారి ధనలక్ష్మి స్పందిస్తూ కొండలో చిరుత సంచారం స్పష్టమైందని వెంటనే ఒక బోను ఏర్పాటు చేసి బంధించే చర్యలు చేపడతామన్నారు. కాగా 2021 ఆగస్టులోనూ చిరుత సంచరించిన విషయాన్ని అభిప్రాయపడ్డారు.



కొండపై చిరుత ఇదే...

చివరిరోజు పోటెత్తిన జనం



సాధకులకు సన్మానంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు సాగు చేసిన పంటలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సాధించిన నూతన వంగడాలు, అత్యాధునిక యంత్రాలతోపాటు సాగుకు అనుకూలమైన విత్తనాలు, క్రిమిసంహారక మందులు, బిందు సేద్యంతోపాటు సేంద్రీయ సాగు, తృణధాన్యాలలో ఆధునికత వంటి అంశాలపై గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే)లో జరిగిన కృషి మేళాకు నాల్గో రోజు సందర్శకులు పోటెత్తారు. గురువారం ప్రారంభమైన కృషి మేళా ఆదివారంతో ముగిసింది. చివరిరోజున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ ముఖ్య అతిథిగా భాగస్వామ్యులయ్యారు. కృషి మేళాను సందర్శించి చిక్కబళ్ళాపుర, కోలారు జిల్లాల పరిధిలోని ఆదర్శరైతులను ఆమె సత్కరించారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ కృషిమేళా దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మేళాను సందర్శించినవారు సాగుపై సాంకేతికత, యంత్రాలు, నూతన వంగడాల అంశాలను గ్రామాలలోని తోటి రైతులకు పంచుకుంటేనే మేళాకు ఒక అర్థం వచ్చినట్టు అవుతుందన్నారు. వ్యవసాయంలో భాగస్వామ్యులైన మహిళా రైతులకు సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. యువత డిజిటల్ టెక్నాలజీ సాగు విధానాల ద్వారా విప్లవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇతర దేశాలు మన ఆధునిక సాగు విధానాలను కొనియాడేలా ఉన్నాయన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఎస్‌వి సురేశ్ మాట్లాడుతూ నాలుగురోజుల కృషి మేళా విజయవంతమైందని ప్రకటించారు. 700కుపైగా స్టాళ్ల ద్వారా వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, అవసరమైన వస్తువుల ప్రదర్శనతో రైతులు సంతోషపడ్డారన్నారు. చివరిరోజు 12.46 లక్షలమంది ప్రజలు మేళాను సందర్శించారన్నారు. నాలుగు రోజులలో 34.13 లక్షలమంది విద్యార్థులు, ప్రజలు తిలకించగా 6.17కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు సాగాయన్నారు.

కృషి మేళాకు గవర్నర్, సీఎంలు దూరం

రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కృషి మేళాకు ఏటా గవర్నర్, సీఎంలు సందర్శించేవారు. తొలిరోజున గవర్నర్ మేళాను ప్రారంభిస్తే చివరిరోజున ముఖ్యమంత్రి బహుమతులు ప్రదానం చేసేవారు. లేదంటే తొలిరోజున సీఎం, ముగింపులో గవర్నర్ పాల్గొనేవారు. ఇలా కొన్నేళ్లకాలంగా కృషి మేళా సాగింది. ఈ ఏడాది కృషి మేళాకు గవర్నర్, సీఎంలు వివిధ కారణాలతో పాల్గొనలేకపోయారు.

జయనగర్‌కు గ్రాంట్ల వివాదం

▸▸ ప్రభుత్వంపై తిరగబడ్డ సంఘాలు



వివిధ సంఘాల ప్రముఖులతో ఎమ్మెల్యే రామమూర్తి తదితరులు

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని అన్ని నియోజక వర్గాలకు ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేసి జయనగర్‌ను విస్మరించిన వివాదంపై పలుసంఘాల సభ్యులు ప్రభుత్వంపై తిరగబడ్డారు. ఆదివారం 'నమ్మ తెరిగె - నమ్మ హక్కు' అనే నినాదంతో ప్రత్యేక సభ జరిపారు. జయనగర్ అభివృద్ధి చెందిన ప్రాంతమని ఇక్కడివారు నివాస, వ్యాపారాల ద్వారా పన్నులు చెల్లిస్తున్నారన్నారు. కానీ గ్రాంట్లు ఇవ్వకుండా బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి అభ్యంతరం తెలపడం సరికాదన్నారు. జయనగర్ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చాలని, చెత్త నిర్వహణ, ట్రాఫిక్, పార్కుల పర్యవేక్షణ ముఖ్యమన్నారు. సభ ముగిశాక బీజేపీ ఎమ్మెల్యే సీకే రామమూర్తి మాట్లాడుతూ డీసీఎం డీకే శివకుమార్ తన వద్ద అణిగిమణిగి ఉండాలన్నారన్నారు. నేను అలాగే ఉన్నానన్నారు. నియోజకవర్గ ప్రజల ముందు బాధ్యుడిగా ఉండాలని, ఆయన ఇంటికి వెళ్లానన్నారు. జయనగర్ పట్ల అంకితభావంతో మాట్లాడితే వాస్తవమే అన్నారు. ఈ ప్రాంతంలో హుక్కాబార్‌లు పెరుగుతున్నాయని, ట్రాఫిక్ సమస్య పెరిగిందని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. కానీ బ్రాండ్ బెంగళూరుగా మార్చేందుకు వెళ్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశానన్నారు. అంతమాత్రాన నియోజకవర్గానికి రూ.10 కోట్ల గ్రాంటు నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇక్కడి ప్రజలు రూ.230కోట్లు పన్నులు కడుతున్నారని మాకు అందులో 10శాతం కూడా ఇవ్వడం లేదని, ఎలా అభివృద్ధి జరుగుతుందని ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి డీకే శివకుమార్ వెళ్లారన్నారు. వెనుతిరిగి వచ్చాక జయనగర ప్రాంత ప్రముఖులంతా చేరి డీసీఎంను భేటీ అవుతామన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి



గ్రంథాలయం ప్రారంభంలో ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతలో పుస్తకపఠనం పట్ల ఆసక్తి పెరగాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దిన్నకొత్తూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జనస్పందన సేవాసమితి ఆధ్వర్యంలో భీమన బెళకు గ్రంథాలయం, పోటీ పరీక్షలకు తర్ఫీదు కేంద్రాన్ని లాంచనంగా ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఎంతో కష్టపడి చదువు నేర్చుకున్నారన్నారు. రాజ్యాంగాన్ని రచించే స్థాయికి ఎదిగి సమాజంలో వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్యాపరంగా బలోపేతం కావాలని సూచించారన్నారు. ఎన్నో పోరాటాలకు మార్గదర్శ మయ్యారన్నారు. పుస్తకాలు కొనుగోలు చేయలేనివారికి పేదలకు రూ.50వేలు ఇచ్చే భరోసా కల్పించారు. కన్నడ సంస్కృతిశాఖ నుంచి పుస్తకాలు కల్పించేందుకు సూచిస్తామన్నారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మునిరాజు, ఎస్సై రాజణ్ణ, దళితరైతు సేన రాష్ట్ర అధ్యక్షుడు హుణసేనహళ్ళి వెంకటేశ్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు మహదేవణ్ణ సుహేల్, కళాకారుడు యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కన్నడసంఘాల పాత్ర కీలకం

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కన్నడ సంఘాలు సంస్కృతితో పాటు భాష, నేల, నీరు అంశాలలో కీలక భూమిక పోషిస్తున్నాయని కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె అభిప్రాయపడ్డారు. యలహంక కోగిలు లే అవుట్‌లో 'కరునాడు జనపడె' కార్యాలయాన్ని, కన్నడ రాజ్యోత్సవాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ, మాజీ న్యాయమూర్తి సిజి హనుమంతు, సంఘం అభిమానులు కృష్ణమూర్తి, బీజేపీ నాయకుడు తమ్మేశ్‌గౌడ పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాబిన్ జీవన్ స్టీఫెన్ ఆధ్వర్యంలో కార్యాలయం ఏర్పాటైంది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కన్నడసంఘాల భూమిక కీలకంగా ఉందన్నారు. కన్నడపట్ల అభిమానం ఇదే తరహాలోనే కొనసాగాలని పిలుపునిచ్చారు. సంఘం కార్యవర్గ సభ్యులు మంజునాథస్వామిగౌడ, నరసింహమూర్తి, జోసెఫ్ రాజాసింగ్, సురేశ్, భాస్కర్, ప్రభుకిరణ్ పాల్గొన్నారు.



కేంద్రమంత్రి శోభాకరంద్లాజెకు సన్మానం

బాలికను వీరనారిగా తీర్చిదిద్దాలి

▸▸ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



కళాకారుల బృందం అభివాదం



వేదికపై రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కన్నయ్య నాయుడు తదితరులు

బెంగళూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో బాలికలను వీరనారిగా తీర్చిదిద్దాలని ఆ దిశగా తల్లిదండ్రులు చేయూత ఇవ్వాలని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పిలుపునిచ్చారు. యలహంక సమీపంలోని ప్రత్తిపాటి ఆంజనేయులు తోటలో కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కార్తీక మాస వనభోజనాల ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. తెలుగు భాషను దశదిశలా వ్యాపింప చేసిన ఘనత ఎన్టీ రామారావుకు దక్కుతుందన్నారు. కాగా సమాజం లో మార్పుకోసం కమ్మ సామాజికవర్గం కృషి చేస్తోందన్నారు. కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడుకు కమ్మ సామాజికవర్గం ఎంతో అండగా ఉందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నీటిపారుదల పథకాల గౌరవ సలహా దారుడు నాగినేని కన్నయ్యనాయుడు మాట్లాడుతూ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించేలా తల్లిదండ్రులు ప్రోత్స హించాలని అభిప్రాయపడ్డారు. కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ అధ్యక్షుడు గుమ్మడి సాంబశివరావు, సంఘం చీఫ్ ప్యాట్రన్ ప్రత్తిపాటి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, సింధనూరు కమ్మవారి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష, జయదేవ ఆసుపత్రి డాక్టర్ నెక్కంటి మురళీకృష్ణ, మానుకొండ రాధాకృష్ణ, సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పురాణ సన్నివేశాలతో నాటికలు సభికులను ఎంతగానో అలరించాయి.

హక్కుపత్రాలు మంజూరు చేయండి

మహదేవపుర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హక్కుపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ జాంభవ యువసేన సంఘం ఆధ్వర్యంలో బెంగళూరు తూర్పు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ధర్నాకు నేతృత్వం వహించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం రమేశ్ చక్రవర్తి మాట్లాడుతూ బెంగళూరు తూర్పు తాలూకా పరిధిలోని కేఆర్‌పుర హోబళి సర్వే 11లో క్యాలసనహళ్ళి గ్రామంలో మాదిగ సామాజిక వర్గాలవారు సుమారు 30ఏళ్లుగా నివసిస్తున్నారని ఇంతవరకు హక్కుపత్రాలు మంజూరు చేయకుండా కుల తారతమ్యబేధం చూపుతున్నారని ఆరోపించారు. సర్వే11లో ఉంటున్న వారికి 20/30 చదరపు అడుగుల స్థలాన్ని గ్రామ పంచాయతీ, జిలా పంచాయతీలో ఆమోదం లభించిం దని అయితే సంబంధిత రికార్డులను అధికారులు నాశనం చేశారని ఆరోపించారు. సర్వే నెంబరు 11లో ఆరు ఎకరాల స్థలాన్ని గుర్తించి అర్హులకు పంపిణీ చేస్తామని బెంగళూరు తూర్పు తాలూకా అధికారి హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు 20/30 అడుగుల చొప్పున పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తు న్నారని నీరు, విద్యుత్ కనెక్షన్ లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఆశ్రయ పథకం కింద లబ్ధిదారులకు హక్కుపత్రాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాంభవ యువసేనా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సి నారాయణస్వామి, సమాజసేవకుడు చంద్రహాస్, పదాధికారులు కోలారు శ్రీనివాస్, క్యాలసనహళ్ళి మంజునాథ్, శ్రీని వాస్, ఎంకే చంద్రశేఖర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



జాంభవ యువసేన సంఘం ఆధ్వర్యంలో నిరసన

సీపీఎం సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ

బాగేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా 18వ సమ్మేళనానికి సంబంధించి పోస్టర్‌లను బాగేపల్లి పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప మాట్లాడుతూ కృష్ణానది నీటిని చిక్కబళ్ళాపుర జిల్లాకు మళ్ళించడం ద్వారా శాశ్వత నీరావరి పథకాన్ని కల్పించి, జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, పేదలకు ఇంటిస్థలాలు పంపిణీ చేయాలనే ప్రధాన డిమాండ్లతో సీపీఎం జిల్లా సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అభిప్రాయపడ్డారు. 70ఏళ్లలో జిల్లా అభివృద్ధికోసం ఎన్నో పోరాటాలు సాగాయన్నారు. రైతులు కరువు కాటకాలతో ఎన్నో సమస్యలు చవిచూశారన్నారు. విద్య, ఉద్యోగం, నరేగా, దళితుల, మహిళలు, కార్మికుల సమస్యలు, నిరుద్యోగం తదితర అంశాలపై సమ్మేళనంలో పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తారన్నారు. ఈనెల 21, 22 తేదీలలో జరిగే సమ్మేళనానికి సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, డాక్టర్ అనిల్‌కుమార్, యు బసవరాజు, కేఎస్ ఉమేశ్, బయ్యారెడ్డి, జయరామరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.



పోస్టర్ల ఆవిష్కరణలో సీపీఎం జిల్లా నాయకులు

పుస్తకపఠనం

కొత్త ఆలోచనలకు నాంది

▸▸ స్వీట్‌బాక్స్ తరహాలో బుక్ బాక్స్

▸▸ పుస్తకసకంతెకు భారీ స్పందన

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం కొత్త ఆలోచనలకు నాంది ఇస్తుందని 'వీరలోక పుస్తకసంతె' నిర్వాహకులు వీరకపుత్ర శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పుస్తక సంతె ముగింపు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో రచయితలకు కొదవ లేదని కానీ పుస్తకపఠనం ఆసక్తి పెరగాల్సి ఉందన్నారు. సాహిత్యం, రచనలు, పద్యాలు, కవితలపట్ల ఆసక్తి కల్గినవారు నేటికీ తమ అభిలాషను కొనసాగిస్తున్నారన్నారు. అయితే యువత డిజిటల్‌వైపు మొగ్గు చూపుతున్నారని పుస్తక పఠనంతో కేవలం ఆలోచనాశక్తి కొత్త అంశాలు నేర్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఇప్పటివరకు అందరికీ తెలిసింది స్వీట్‌బాక్స్ మాత్రమేనని ఇకపై వీరలోక ద్వారా బుక్‌బాక్స్ పరిచయం చేస్తున్నామన్నారు. వేడుకలు ఇతరత్రా కార్యక్రమాల్లో స్వీట్లకు బదులు బుక్‌బాక్స్‌ను బహుమతిగా ఇవ్వడం నేర్చుకోవాలన్నారు. పుస్తకం అందుబాటులో ఉంటే ఎవరైనా చదువుతారని అందుకే కొత్త పంథాను పరిచయం చేస్తున్నామన్నారు. పుస్తకసంతెలో పలు పుస్తకాలను ఆవిష్కరించామన్నారు. మూడు రోజుల సంతెకు నగర ప్రజలు ప్రత్యేక అభిమానం చూపారని అందుకు అనుగుణంగానే అన్ని పబ్లిషర్స్ నుంచి భారీగా పుస్తకాలు అమ్మకాలు సాగాయన్నారు.

సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణతోనే

రాజ్యోత్సవానికి సార్థకత



వివిధరంగాల సాధకులకు సన్మానం

దొమ్మసంద్ర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర చరిత్ర, కళలు, సంస్కృతి, ఆచార వ్యవహారాల గొప్పదనాన్ని కన్నడిగులు అవగాహన చేసుకుని ఆచరించినపుడే కన్నడ రాజ్యోత్సవానికి సార్థకత సాధ్యమని ఆయుష్ టీవీ ముఖ్యులు ఎస్ఎల్ఎన్ స్వామి అభిప్రాయపడ్డారు. స్థానిక అసెట్స్ 63 డిగ్రీ ఈస్ట్ అపార్ట్‌మెంట్‌లో రాజ్యోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కన్నడకోసం పాటుపడిన మహనీయుల చరిత్రను తెలుసుకునేందుకు కన్నడ రాజ్యోత్సవం నవంబరు నెలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా ఆచరించాలన్నారు. హల్మిడి శాసనాలు కన్నడ ప్రథమ శాసనాలు అన్నారు. కర్ణాటకలో గంగ, కదంబ, చాళుక్యులు, హొయ్సళ, రాష్ట్రకూటులు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తులు, మైసూరు మహారాజులు పాలించారన్నారు. నేటి యువతకు పూర్వీకుల చరిత్ర, సాధనలు తెలియాలన్నారు. విజయనగర రాజులకాలంలో రత్నాలు, ముత్యాలతో శ్రీమంత సామ్రాజ్యంగా కొనసాగిందని కన్నడ సాహిత్యానికి ఎంతోమంది సాహితీవేత్తలు కృషి చేశార న్నారు. వివిధ రంగాల సాధకులకు జ్ఞాపికలతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో వీరగాసె, డొళ్ళుకుణిత, కీలుగుర్రాలు, పాఠశాల విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకుడు, కొడతి గ్రామ పంచాయతీ సభ్యుడు బాబురెడ్డి, హాలనాయకనహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు బాబురెడ్డి, అసెంట్స్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు గౌతమ్, ఉపాధ్యక్షులు అంబికా రావ్, కార్యదర్శి జాణతన్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

43 యూనిట్ల రక్తం సేకరణ

విజయపుర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకాలోని విజయపుర పట్టణంలోని పురసభ శహరి రోజ్‌గార్ కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, యలహంక లయన్స్ రక్తనిధి సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు రక్తదానంలో పాల్గొన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. చందేనహళ్ళి గ్రామపంచాయతీ సభ్యుడు ఎం జగదీశ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం ద్వారా ఇతరుల ప్రాణం కాపాడినట్టు అవుతుందన్నారు. బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కనకరాజు మాట్లాడుతూ తరచూ ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేస్తున్నారన్నారు. భజరంగ్‌దళ్ జిల్లా సంయో జకుడు వి కృష్ణమూర్తి మాట్లాడుతూ అయోధ్య బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా యువత పాల్గొనడం అభినందనీయమన్నారు. శిబిరం ద్వారా 43 యూనిట్ల రక్తాని సేకరించబడిందన్నారు. పురసభ ముఖ్యాధికారి సంతోష్, ప్రగతి ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కార్యక్రమ అధికారి ఆర్‌శెట్టినాయక్, ఇన్‌స్పైర్ కళాశాల ప్రిన్సిపాల్ శిల్పా, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేత

ఘన స్వాగతం

రాయచూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సభ్యుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న కలబుర్గి దర్గా హజరత్ ఖాజా బందే నవాజ్ సజ్జాదెగా ఉన్న హజరత్ సయ్యద్ షా అలివుల్లా హుసేని సాహెబ్‌కు ఆదివారం నగరంలో ఘన స్వాగతం లభించింది. కేంద్ర మాజీ మంత్రి సీఎం ఇబ్రాహింతో కలిసి వక్ఫ్‌బోర్డు ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ఆయన వక్ఫ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.